నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## కర్నూలు | నంద్యాల
బుధవారం | 02 ఏప్రిల్ 2025 | పేజీలు 8





### ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులందరికీ

# సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ చేయాలి



వృద్ధులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి, ఆర్థిక శాఖ కార్యదర్శి నివాస్, కలెక్టర్ రాజకుమారి

- ఆర్థిక శాఖ కార్యదర్శి నివాస్, నంద్యాల కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరికీ సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేయాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి, ఆర్థిక శాఖ కార్యదర్శి నివాస్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నంద్యాల మండలంలోని రాయమాల్పురం గ్రామం ఎస్టీ కాలనీలో, నంద్యాల పట్టణం వీసీ కాలనీలో సామాజిక భద్రత పెన్షన్ల మిగతా 2లో




- పన్నుల వసూలులో వెనుకబడ్డ మున్సిపాలిటీ
- రాష్ట్రంలో 98వ స్థానానికి పడిపోయిన నంద్యాల
- ప్రభుత్వ భవనాల పన్ను బకాయిలు రూ.4 కోట్ల పై మాటే..
- సత్ఫలితాలను ఇవ్వని సచివాలయాలు
- మున్సిపల్ రెవెన్యూ విభాగంలో సిబ్బంది తక్కువ..పని భారం ఎక్కువ
- గత ఏడాదితో పోలిస్తే కాసింత మెరుగు

### నంద్యాల మున్సిపాలిటీ చరిత్ర ఘనం..

# పన్నుల వసూలులో సెంచరీ మిస్



పన్నులు వసూలు చేస్తున్న ఆర్ఓ ఆంజనేయులు బృందం



పన్నులు వసూలు చేస్తున్న ఆర్ఐ దేవరాజ్ బృందం



పన్నులు వసూలు చేస్తున్న ఆర్ ఐ యుగంధర్ బృందం

**నంద్యాల, మేజర్ న్యూస్ బ్యూరో :** నూటా ఇరవై ఆరు సంవత్సరాల చరిత్ర కలిగిన నంద్యాల స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ గా హోదాతో కొనసాగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోని తరువాత నంద్యాల రెండవ మున్సిపాలిటిగా ఏర్పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండవ పార్లమెంట్ స్థానమైన నంద్యాల కర్నూలు కార్పొరేషన్ తర్వాత అతి పెద్ద మున్సిపాలిటిగా పేరొందింది. అంతటి చరిత్ర కలిగిన నంద్యాల మున్సిపాలిటి ఈ ఏడాది పన్నుల వసూళ్ళలో వెనుకబడింది. రాష్ట్రంలోని 126 కార్పొరేషన్, మున్సిపాలిటి, నగర పంచాయతీల్లో నంద్యాల 98వ స్థానానికి పడిపోయింది. ప్రజలకు అతి దగ్గరగా సేవలు అందించే లక్ష్యంగా గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలు సత్ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయి. మిగతా 2లో

### జిల్లాలోని 2.38 లక్షల మందికి

# పింఛన్లు పంపిణీ

- రూ.103.30 కోట్ల రూపాయలు అందజేత
- లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను అందజేసిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



పెన్షన్ల పంపిణీలో పాల్గొని పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్ న్యూస్ :** ప్రతినిధి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద ఏప్రిల్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 38 వేల 302 మంది పెన్షన్ లబ్దిదారులకు రూ. 103.30 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాపేర్కొన్నారు.మంగళవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా నగరంలోని సాయిబాబా సంజీవ నగర్‌లో అరుణ జ్యోతి, శంకరమ్మలకు వితంతు పెన్షన్లు, దేవర్ల నరసింహులు, భీమక్క, లలితాబాయి, రాగప్పలకు వృద్ధాప్య పెన్షన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు. మిగతా 2లో

### ప్రశాంత వాతావరణంలో

# పది పరీక్షల నిర్వహణ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. మంగళవారం నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ పాఠశాలనందు జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని ఎలాంటి మాస్ కాపియింగ్‌కు అవకాశం లేకుండ కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు ముగిశాయని తెలిపారు. మిగతా 2లో

# విజిలెన్స్ అండ్ సివిల్ సప్లై అధికారుల దాడులు



ఎండియు వాహనాన్ని తనిఖీ చేస్తున్న డిఎస్ఓ రాజా రఘువీర్

- ఒక రేషన్ దుకాణం సీజ్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్న ఒక రేషన్ దుకాణాన్ని సీజ్ చేసి ఇద్దరు ఎండియు ఆపరేటర్లపై దాడులు చేసినట్లు సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రాజా రఘువీర్ తెలిపారు. మిగతా 2లో



సీజ్ చేసిన రేషన్ దుకాణం వద్ద అధికారులు

### జిల్లా వృద్ధి రేటు 15 శాతం సాధించేలా

# ప్రణాళిక రూపొందించండి

- రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి నివాస్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఈ ఆర్థిక సంవత్సరం వాస్తవ జిడిపికి అదనంగా 15శాతం వృద్ధిరేటు సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నివాస్ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి నివాస్

మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల స్థూల జాతీయోత్పత్తి 15శాతం వృద్ధిరేటుపై జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, మిగతా 2లో

## నంద్యాల మున్సిపాలిటీ చరిత్ర ఘనం..

# పన్నుల వసూలులో సెంచరీ మిస్

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ రెవెన్యూ విభాగంలో తక్కువ సిబ్బంది ఎక్కువ పని భారంతో విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కాసింత మెరుగు కనబరిచింది. ప్రభుత్వం ఇంటి పన్నులపై 50 శాతం వడ్డీ మాఫీ ప్రకటించడంతో కొద్ది మేర మెరుగైన ఫలితాన్ని సాధించగలిగింది. గత ఏడాది 15 రోజుల ముందర వడ్డీ మాఫీ ప్రకటించగా అంతకు ముందు ఏడాది వడ్డీని ప్రభుత్వం పూర్తిగా మాఫీ ప్రకటించింది. ఈ ఏడాది ఆరు రోజుల ముందర మార్చి 25న 50 శాతం వడ్డీని మాఫిని ప్రకటించింది. అందులో ఉగాది, రంజాన్ పండుగలు పోగా, కేవలం నాలుగు రోజులు మాత్రమే వడ్డీ మాఫీతో పన్నుల వసూళ్ళు సాధ్యమైంది. గడచిన ఐదేళ్ళలో నంద్యాల మున్సి పాలిటి మొదటి 30 స్థానాల్లో కొనసాగుతుండేదని మున్సిపల్ అధికా రిక లెక్కలు చెబుతున్నాయి. కొత్త జిల్లా నంద్యాలలో కార్పొరేషన్ హోదాకు అతి దగ్గరగా ఉన్న నంద్యాల మున్సిపాలిటి పన్నుల వసూళ్ళలో రాష్ట్రంలో క్రింద నుంచి 28వ స్థానానికి పడిపోయిన నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

రాష్ట్రంలో 126 కార్పొరేషన్, మున్సిపాలిటిలు, నగర పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 15 కార్పొరేషన్లు కాగా 111 మున్సిపాలిటిలు, నగర పంచాయతీలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. ప్రతి ఏడాది ఏప్రిల్ మాసం నుంచి రానున్న ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తారు. నంద్యాల జిల్లాలో అతి పెద్ద మున్సిపాలిటిగా ఉన్న నంద్యాలలో 49,047 ఇళ్ళులు ఉన్నాయి. వీటి నుంచి ప్రతి ఏడాది రూ. 19.65 కోట్లు పన్నులు వసూలు చేయాలి. నంద్యాల మున్సిపాలిటిలో పాత బకాయిలు రూ.7.32 కోట్లు ఉన్నాయి. మొత్తంగా నంద్యాల మున్సిపాలిటిలో రూ. 26.97 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉండింది. ఈ ఏడాది పాత బకాయిలు రూ. 2.54 కోట్లు, ప్రస్తుత ఏడాది రూ. 15.35 కోట్లు మొత్తంగా రూ.17.89 కోట్లు ఇంటి పన్నులు వసూలైంది. పన్నుల వసూలులో 66.34 శాతం మేర పన్నులను వసూలు చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటిలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలతో పోలిస్తే 98వ స్థానంలో కొనసాగుతుంది. గత ఏడాది పన్నులు రూ. 16.28 కోట్లు వసూలైంది. గత ఏడాదితో పోలిస్తే రూ. 1.61 కోట్లు అదనంగా వసూలు చేశారు. ఈ ఏడాది కాలంలో నంద్యాలలో భవనాల సంఖ్య భారీగా పెరిగినట్లు మున్సిపల్ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దీంతో పోలిస్తే పన్నుల వసూలులో నంద్యాల మున్సి పాలిటి పూర్తిగా వెనుకబడిందని చెప్పక తప్పని పరిస్థితులు కనిపిస్తు న్నాయి. నంద్యాల మున్సిపాలిటిలో ఆర్వో ఆంజనేయులు, ఆర్ఐలు యుగంధర్, దేవరాజులు మూడు బృందాలుగా ఏర్పడి పన్నులను వసూలు చేశారు. నంద్యాల మున్సిపాలిటిలో కలసిన అతి పెద్ద వార్డు గా ఉన్న రైతునగరం ఇంటి పన్నులను ఇమ్మానియేల్ వసూలు చేశా రు. ఆర్ఓ బృందంలో రాజు, ప్రసాద్, ఆర్ఐ యుగంధర్‌తోపాటు శ్రీధర్, ఆర్ఐ దేవరాజ్‌తోపాటు రాజు, చంద్రనాయక్‌లు ఇంటి పన్నుల వసూలు చేశారు. సుమారు యాభై వేల ఇళ్ళు కలిగిన నంద్యాల మున్సిపాలిటిలో ఒప్పంద కార్మికులతో కలిపి పది మంది ఇంటి పన్నులను వసూలు చేశారు. ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వ పాలన అందించే లక్ష్యంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలు నంద్యాల మున్సిపల్ రెవెన్యూ విభాగానికి చేయూతను అందించలేక పోయాయి. సచివాలయాల్లోని అడ్మిన్లు ఇంటి పన్నులను, ఎమ్యూనిటిస్ కొళాయి పన్నులను వసూలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు సచివాలయ ఉద్యోగులు చేస్తున్నారు. మొత్తం 10 సర్వేలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరో 20 సర్వేలు చేపట్టేందుకు రంగం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద మున్సిపల్ రెవెన్యూ విభాగంలో తక్కువ సిబ్బంది ఎక్కువ పని భారాన్ని మోస్తున్నట్లు స్పష్టం అవుతుంది. ప్రభుత్వ భవనాల బకాయిలు రూ. 4 కోట్లు ఉండగా, రూ. 20 లక్షలు వసూలు కావడం కొసమెరుపు.

## ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులందరికీ సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)



రాయమాల్పురంలో నీటితొట్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నివాస్, తదితరులు



రాయమాల్పురం సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న నివాస్

పంపిణీ విధానాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి పరిశీలించా రు. ఈసందర్భంగా కార్యదర్శి నివాస్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతి నెల 1వ తేదీ ఉదయం 7గంటలకు సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రాయమాల్పురం గ్రామం బీసీ కాలనీలో వృద్ధ మహిళ తో స్పెషల్ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఏప పథకాలు వస్తున్నాయని ప్రతినెల పెన్షన్ తీసుకుంటున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, వితంతువులకు నెలకు రూ. 4వేలు, దివ్యాంగులకు రూ. 6వేలు చొప్పున ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల తాగునీటి తొట్ల నిర్మాణ పనులకు జిల్లా ఇన్‌చార్జి అధికారి, ఆర్థిక శాఖ కార్యదర్శి భూమిపూజ చేశారు. అదే గ్రామంలో ఉన్న గ్రామ సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు ఏప సర్వీసులు అందిస్తున్నారని డిజిటల్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. స్వీకరించిన దరఖాస్తులను ఎన్ని రోజుల లోపల పరిష్కార మార్గాలు చూపిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వృద్ధి రేటు 15శాతం సాధించేలా ప్రణాళిక రూపొందించండి

(మొదటి పేజీ తరువాయి)

డీఆర్వో రామునాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసంద ర్భంగా స్పెషల్ అధికారి, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి నివాస్ మాట్లా డుతూ ఈ ఆర్థిక సంవత్సరం వాస్తవ జిడిపికి అదనంగా 15 శాతం వృద్ధిరేటు సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా స్పెషల్ అధికారి నివా స్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధికి 15శాతం వృద్ధిరేటు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. గత సంవత్సరం జిల్లా గ్రాస్ జిల్లా డొమెస్టిక్ ప్రొడక్ట్‌గా రూ.43,630 కోట్లుగా ఉందని ఈ ఏడాది వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలలో 15శాతం వృద్ధిరేటు లక్ష్యంతో రూ.50,726కోట్లకు పైగా పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభం వచ్చేలా దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలలో చాలా వరకు 60:40నిష్పత్తిలో ఉంటాయని సంబంధిత అంశాలలో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సాయిల్ హెల్త్ కార్డ్స్, డ్రిప్ ఇరిగేషన్‌పై దృష్టి సారించాలన్నారు. రైతులు ఒకే పంటకు పరిమితం కాకుండా రెండు రకాల పంటలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైక్రో ఇరిగేషన్ కింద ప్రతి రైతులకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు డ్రిప్ సౌకర్యం పెట్టుకోవడానికి 90నుంచి 100శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందుకు ప్రతి రైతుకు డ్రిప్ ఇరిగేషన్ ఉపయోగించేలా చూడాలన్నారు. పశు సం వర్ధక శాఖకు సంబంధించి అనివార్య కారణాల వల్ల పశుసంపద మృత్యువాత పడితే రైతులు ఇబ్బంది పడకుండా నష్టానికి బీమా సదుపాయంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో అధిక శాతం ఉద్యాన పంటల విస్తరణతో పాటు సోయాబీన్, పండ్ల తోటల అభివృద్ధి చేస్తే వృద్ధిరేటు శాతం పెంచే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని నాలుగు మండ లాలైన దొర్నిపాడు, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల్లో ఒకే పంటకు పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో 13 సమ్మర్ స్టోరేజి ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు.

## జిల్లాలోని 2.38 లక్షల మందికి పించన్లు పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా పెన్షన్ అందచేసే సమయంలో సర్వర్ లో ఏమైనా సమస్యలు ఉన్నాయా ?? టెక్నికల్ సమస్యలు ఏమైనా ఉన్నాయా?? అని కలెక్టర్ సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ పెన్షన్ లు సరైన సమయానికి ఇస్తున్నారా?? ఉదయం ఏ సమయానికి ఇస్తున్నారు ?? ఒకవేళ ఈ నెల మీరు పెన్షన్ తీసుకోకపోతే వచ్చే నెల రెండు పెన్షన్ లు కలిపి తీసుకోవచ్చు అని కలెక్టర్ పెన్షన్ దారులకు అని అవగాహన కల్పించారు. దేవర్ల నరసింహులకు వృద్ధాప్య పెన్షన్ ను అందచేస్తూ కలెక్టర్ వారికుటుంబం, పిల్లల గురించి అడిగి తెలుసుకున్నారు. అతని ఇల్లు సరిగా లేకపోవడంతో ఇంటిని నిర్మించుకునేందుకు అతని నుండి దరఖాస్తు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. ఎవరికైనా ఇల్లు లేకపోయినా, గుడిసెలో ఉన్నా, ఇల్లు సరిగా లేకపోయినా, అలాంటి వారికి ఇల్లు మంజూరు చేసేందుకు దరఖాస్తులు తీసుకోవాలని కలెక్టర్ సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు , కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అండ్ సివిల్ సప్లై అధికారులు దాడులు

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం విజిలెన్స్ అండ్ సివిల్ సప్లయ్ అధికారులు నగరంలోని పలు రేషన్ దుకాణాలను, ఎండియు వాహనాలను తనిఖీ చేశారు. ఈ దాడుల్లో 62వ నంబర్ ఎండియు ఆపరేటర్ పి మహేష్‌కు చెందిన ఎండియు వాహనాన్ని తనిఖీ చేయగా 245కేజీల బియ్యం, 80కేజీల చక్కెర ప్యాకెట్లు నిల్వలో తక్కువ ఉండడంతో అతనిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 53వ నంబర్ డీలర్ రేషన్ షాప్ యజమాని దుకాణం ఓపెన్ చేసి ప్రజలకు బియ్యం పంపిణీ చేయడం లేదన్న సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి దుకాణ యజమానిని పిలిచినా రాకపోవడంతో ఆ దుకాణాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే మరో ఎండియు ఆపరేటర్‌ను తనిఖీ చేయగా అందులో ఎలాంటి తేడాలు లేనట్లు గుర్తించామన్నారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ రవాణాపై తమకు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, నగర సహాయ, సరఫరాల అధికారి రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పది పరీక్షల నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లకు కేటాయించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించారన్నారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం శుభపరిణామమన్నారు.

**430మంది గైర్హాజరు :** మంగళవారం జిల్లావ్యాప్తంగా జరిగిన పదవ తరగతి సోషల్ పరీక్షల్లో 430మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. ఇందులో 293మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా 137మంది ప్రైవేటు విద్యార్థులు వున్నారు. 31,990మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా విద్యా శాఖ అధికారి 6పరీక్ష కేంద్రాలు తనిఖీ చేయగా సహాయ కమీషనర్ పరీక్షల విభాగం వారు 2కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 40కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్‌లు 33పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ ఘటనలు చోటు చేసుకోలేదు.

## పశువులకు నీటి తొట్లు ఏర్పాటు

**సి.బెళగల్ ,మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో పశువులకు నీటి తొట్ల నిర్మాణాలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పాడి పశువుల దాహం తీర్చుటకు నీటి తొట్ల నిర్మాణాలకు ముందుకు రావాలని ఎంపీడీఓ. రాణెమ్మ సూచించారు. అందులో భాగంగా సి.బెళగల్ గ్రామంలో సర్పంచ్ పాండు రంగన్న ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా నీటి తొట్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ.రాణెమ్మ, ఈఓఆర్డి. ఈశ్వరయ్య స్వామి, సర్పంచ్ పాండు రంగన్న, ఉపాధి హామీ ఏపిఓ.రామన్న, టీఏ లు తదితరులు పాల్గొన్నారు.



# పైప్‌లైన్ లీకేజీలకు వెంటనే మరమత్తులు చేపట్టండి



పైప్‌లైన్ లీకేజీలను పరిశీలిస్తున్న కమీషనర్ రవీంద్రబాబు

**కర్నూలు నగరం, మెజర్‌న్యూస్ :** నగరంలో పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే జాప్యం చేయకుండ వెంటనే మరమత్తు పనులు చేపట్టాలని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వీకర్ సెక్షన్ కాలనీ, పెద్దపాడు రహదారి ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీలను పరిశీలించారు. వేసవికాలం ప్రారంభమైనందున తాగునీటి వృధా అరికట్టాలని, నగర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండ అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని కమీషనర్ అధికారులను సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే అక్కడి స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని, నీటిని పొదుపుగా వాడుకుంటూ నీటి వృధాను అరికట్టేందుకు సహకరించాలని కమీషనర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిఈఈ నరేష్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి,వర్క్ ఇన్‌స్పెక్టర్ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థలపై

# చర్యలు తీసుకోవాలి




బ్యానర్లు తొలగిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో జిల్లా విద్యా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబుబాకర్, సాయి ఉదయ్‌లు అన్నారు. మంగళవారం కొత్త బస్టాండ్ సమీపం వద్ద అక్రమంగా అడ్మిషన్ల కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎస్ఎఫ్ఐ ఆద్వర్యలలో తొలగించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండ ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడానికి అధికారులు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడాల్సిన విద్యా శాఖ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థలకు సహకరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన లక్ష్యాలను సాధించండి



మాట్లాడుతున్న కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో చేపట్టే పనులపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించి కేటాయించిన లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓ, ఏపీడీలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఉపాధి హామీ పనుల లక్ష్య ప్రగతి సాధనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్ధేశం చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం కింద పశువులకు నీటితొట్ల నిర్మాణం, సేద్యపు నీటికుంటలు, పంట కాలువలను పునరుద్ధరించడం, చెరువులు, కుంటలను సమగ్రంగా అభివృద్ధిపరచడం, ఉపాధి వేతనదారులను దినసరి వేతనాన్ని పెంచడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటి నుంచే కేటాయించిన లక్ష్యాన్ని సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ, ఏపీడీలను ఆదేశించారు. పశువుల మంద గుంపుగా ఉన్న నీటి వసతి ఉన్న ప్రదేశాలలో పశువులకు నీటితొట్ల పనులను ప్రారంభించాలన్నారు. జిల్లాలో 537 పశువులకు నీటితొట్ల నిర్మాణ పనులను ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాకు నిర్ధేశించిన 2,500 సేద్యపు నీటికుంటల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు 20శాతం ఉపాది కూలీలు సేద్యపు నీటి కుంటల పనులను హాజరయ్యేటట్లు చూడాలన్నారు. 9,560కి.మీ మేర పంట కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి వేతనదారులకు 300 కూలి గిట్టుబాటు అయ్యేలా పొడవు, వెడల్పు లోతుతో కొలతలు ఇచ్చి పనులు చేయించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో 75లక్షల పనిదినాలకు గాను 74.75 లక్షల పనిదినాలు పూర్తి చేసి 99.67శాతం సాధించాలన్నారు 9850కుటుంబాలు వందరోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నారన్నారు. 10,268 కి.మీ పంట కాలువల పునరుద్ధరణ పనులను గాను 9415 కి.మీ పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

**– కేరింతలు కొడుతూ ఇంటి దారి పట్టిన విద్యార్థులు**




**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండలంలో పదవ తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 17వ తేదీన ప్రారంభమైన పరీక్షలు సోషల్ పరీక్షతో పూర్తయ్యాయి. విద్యాధికారుల ఆదేశాలతో మండలంలో 5పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి 921మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 915మంది హాజరై ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. వారందరికి పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండ మండల విద్యా శాఖ అధికారి చర్యలు తీసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు పర్యటిస్తూ పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. చివరిరోజు ఇద్దరు గైర్హాజరయ్యారు. చివరిరోజు కావడంతో పరీక్షలకు విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో హాజరయ్యారు. పది పబ్లిక్ పరీక్షల నుండి విద్యార్థులకు ఉపశమనం కలగడంతో విద్యార్థులు రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు కొడుతూ పరీక్ష హాలు నుండి బయటకు వచ్చారు. హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు ఇంటి బాట పట్టారు. తల్లిదండ్రుల వద్ద తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.

# పింఛన్ లబ్ధిదారులకు ఎన్‌టిఆర్ పింఛన్ భరోసా



మహిళకు పించన్‌ను అందిస్తున్న గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని దాదాపు 65 లక్షల మందికి నెల మొదటి రోజునే పించన్‌లు పంపిణీ చేసి వారికి అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందని, ఎన్‌టిఆర్ పించన్ భరోసా లబ్దిదారులకు అండగా నిలుస్తుందని బూరుగల గ్రామ టిడిపి నాయకులు పురుషోత్తమరెడ్డి, కాటం సూర్యప్రకాశ్‌రెడ్డి, బొమ్మన హేమంత్‌రెడ్డి, చిన్నకృష్ణయాదవ్, తోట వెంకటరాముడు, సిద్దప్పరాజుయాదవ్, ఓబుళరాజులు అన్నారు. బుధవారం గ్రామంలో భర్తలు మృతి చెందిన మహిళలకు నెలలోపే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్‌ల సంకల్ప ఉద్దేశ్యంతో డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి స్పందించి లబ్దిదారులైన గుర్రాల రామక్క, దూదేకుల హుసేనమ్మలకు పించన్‌లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామ టిడిపి నాయకులు గ్రామంలోని పించన్‌దారులకు పించన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామాంజి, చిన్నరంగడు, నాగరాజు, పక్కిరా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడండి

## కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త గార్లపాటి డాక్టర్ మద్దులేటిస్వామి

**డోన్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం నందు అడ్మీషన్ల ప్రక్రియను ప్రారంభించి విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, ఇంచార్జ్ గార్లపాటి డాక్టర్ మద్దులేటిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఐటిఐ నందు ఏర్పాటు చేసిన తాత్కాలిక నూతన భవనంలో తరగతులను నిర్వహించి, విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైనప్పటికీ, నేటి వరకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేకపోవడం దారుణమన్నారు. కావున అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా కేంద్రీయ విద్యాలయంకు అడ్మిషన్లు ప్రారంభించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం



కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ కాస్తా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని త్వరతిగతిన స్పందించాలన్నారు.

# దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలి



వినతి పత్రం ఇస్తున్న శాంతికుమార్

**దేవనకొండ మేజర్ న్యూస్ :** ఈ యేడాది రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డివిఎంసి సభ్యులు కాకర్ల శాంతి కుమార్ మంగళవారం కర్నూలులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడి వరలక్ష్మికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవనకొండ మండల రైతులు ఈ యేడాది రబీ సమయంలో శెనగ,వేరుశెనగ, జొన్న, మిరపను అధికంగా సాగు చేశారు. అయితే సరైన వర్షాలు లేకపోవడంతో 90శాతం మంది రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడ రాలేదని ఆవేధనను వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. కాబట్టి దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని విన్నవించారు.

# మండలంలో ముగిసిన పది పరీక్షలు



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలో మూడు పరీక్షా కేంద్రాలలో జరిగిన పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం చివరి రోజు పరీక్షకు 15 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో రామసుబ్బయ్య తెలిపారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పది పరీక్షలు వ్రాశారని ఎంఈవో తెలిపారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తమ సిబ్బందితో పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు. గత నెల మార్చి 17 నుంచి ప్రారంభమైన పది పరీక్షలు ఏప్రిల్ 1వతేదీతో ముగియడంతో విద్యార్థులు ఆనందోత్సాహాలతో పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ఒకరి కొక్కరు ఆల్ ది బెస్ట్ చెప్పుకొని తమ ఇళ్ళకు వెళ్ళారు.

# పేదలకు ఆసరా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్

**– గ్రామ సర్పంచ్ పల్లె నిర్మలమ్మ**



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన మాట ప్రకారం పేదలకు పెంచిన పింఛన్ మొత్తాన్ని అందిస్తూ పేదలకు ఆసరాగా తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని నిరూపించిందని పోతులపాడు గ్రామ సర్పంచ్ పల్లె నిర్మలమ్మ అన్నారు. ఏప్రిల్ 1వ తేదీన గ్రామంలో నూతనంగా మంజూరైన వితంతు పింఛన్‌ను ఓబులమ్మకు గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భర్త చనిపోయి నెలలోపలే భార్యకు పింఛన్ అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని, పేదలకు ఆసరా ఎన్‌టీఆర్ పింఛన్ అని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లె శివానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# జూపాడుబంగ్లాలో సంతమార్కెట్ వేలం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే సంతమార్కెట్ వేలం గ్రామ సర్పంచ్ బాలయ్య అధ్యక్షతన ఈవోఆర్డీ సంజన్న ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శి తిప్పన్న నిర్వహించారు. ఈ వేలంలో 11 మంది వేలందారులు పాల్గొన్నారు. అందరికంటే ఎక్కువగా ఏ.రాజు అనే వ్యక్తి రూ. 1.91లక్షలకు పాటపాడి దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం వేలంలో ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పంచాయతీ కార్యదర్శి మణికంత, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శీలం భాస్కర్‌నాయుడు బాధ్యతలు



**డోన్, మేజర్‌న్యూస్:** డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శీలం భాస్కర్‌నాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తోటి న్యాయవాదులు, అడ్వకేట్‌లు ఆయనను సన్మానించి, శుభాకంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, అడ్వకేట్‌లు, బార్ అసిసోయేషన్ సభ్యులు పాల్గొనారు.

## పదవీ విరమణ పొందిన పోలీసులకు ఘన సన్మానం



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పనిచేసి పోలీసు సిబ్బంది పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. పదవీ విరమణ పొందిన కర్నూలు పిసిఆర్ ఎస్ఐ బి పుల్లన్న నాయక్, ఎఆర్ ఎస్ఐ ఎల్.ఎస్. రంగారెడ్డి, ఎఆర్‌పిసి కె వెంకట రామిరెడ్డిను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసులు మిగిలిన జీవితాన్ని తమ కుటుంబాలతో సంతోషంగా గడపాలన్నారు. పదవీ విరమణ పొందిన అనంతరం ఏమైన సమస్యలుంటే నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చని తెలిపారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్, డిపిఓ ఏఓ విజయ కుమార్ నాయుడు, స్పెషల్ బ్రాంచ్ సిఐలు కేశవరెడ్డి, తేజ మూర్తి, ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

## కౌతాళంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి



ఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న తోట రామకృష్ణ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లాలోని మండల కేంద్రమైన కౌతాళంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ అన్నారు. మంగళవారం విజయవాడలోని బిజెపి ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కౌతాళం మండలానికి వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని వినతిప్రతం అందచేశారు. సిఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా కౌతాళంకి వచ్చినప్పుడు కౌతాళం మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల గురించి ఆయనకు తెలుపగా ఇందుకు సానుకూలంగా స్పందిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌతాళంకి 100పడకల ఆసుపత్రి మంజూరు చేసి నిర్మించి ఇస్తామని మాట ఇచ్చారని తెలిపారు. అందులో భాగంగా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ని కలిసి కోరినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే మంజూరు చేస్తామని తెలిపారన్నారు.

## కల్లూరులో మూడోరోజు కొనసాగిన ఉగాది ఉత్సవాలు – ఎద్దుల రాతిదూలం పోటీలు



ఎద్దుల రాతిదూలం పోటీల్లో పాల్గొన్న సులేమాన్ బాష

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఉగాది ఉత్సవాలు కల్లూరులో మూడోరోజు కొనసాగాయి. రైతు సంఘం ఆద్వర్యంలో మంగళవారం ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. గత 35సం॥లుగా ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏపి, తెలంగాణ రాష్ట్రాల నుంచి రైతులు వారి ఎద్దులను తీసుకువచ్చారు. మొదటి ఏడు విజేతలకు నిర్వాహకులు బహుమతులు ఏర్పాటు చేశారు. రైతులను ఉత్సాహ పరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని నాయకులు తెలిపారు. మొదటి బహుమతి కీ.శే బి ఈశ్వరప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారులు రూ.50వేలు, రెండో బహుమతి కి.శే వాడాల గణేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం వాడాల రామిరెడ్డి రూ.45వేలు, మూడో బహుమతి డోగూరు రాముడు రూ.40వేలు, నాల్గో బహుమతి కురువ మల్లయ్య రూ.30వేలు, ఐదో బహుమతి డోగూరు వెంకటేశ్వర్లు రూ.25వేలు, ఆరో బహుమతి ఎస్ మాలిక్ బాష,ఏడో బహుమతి కీ.శే మీసాల తిమ్మన్న కుమారులు రూ.10వేలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, కల్లూరు పెద్దలు రామకృష్ణ , మహేశ్వరరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# దప్పిక తీరే దారేది



వాటర్ బాటిల్‌తో నీటిని తాగుతున్న వానరం



ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ : ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. మండలంలో భూగర్భ జలం అడుగంటిపోయి జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మూగజీవాల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వాగులు ఎండిపోవడంతో దాహార్తి తీరక అల్లాడిపోవాల్సి వస్తుంది. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నీటి కోసం వానరం వాటర్ బాటిళ్లతో చలివేంద్రంలో దాహం తీర్చుకునేందుకు ప్రయత్నించింది. తన దాహం తీరలేదు. మనుషుల ఏర్పాటు చేసినట్లే మాకు కూడా నీటి వసతి ఉంటే బాగుండేది కదా అన్నట్లు వానరాలు చూస్తున్నాయి. గ్రామాలలో పశువుల దప్పిక తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణానికి ఏర్పాటు చేయాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# అట్టహాసంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ



వికలాంగుడికి పెన్షన్ అందిస్తున్న వీరభద్ర గౌడ్

**ఆలూరు,మేజర్ న్యూస్ :** ఆలూరు టీడీపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో అరికెర,నిట్ర వట్టి తదితర గ్రామాల్లో ఎన్ టిఆర్ భరోసా పెన్షన్ లను వికలాంగులకు, వితంతులకు,వృద్ధులకు టీడీపీ నాయకుల తో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వెయ్యి రూపాయల పెన్షన్ అందించడానికి జగన్ నాలుగేళ్లు సమయం తీసుకున్నారని కానీ చంద్రబాబు వెయ్యి రూపాయలను అధికారం లోకి వచ్చిన మొదటి నెలలో అందించారని అన్నారు.అలాగే మూడు నెలలకు కూడా ఒకసారి పెన్షన్ అందించే అవకాశం కల్పించారని అన్నారు.త్వరలో అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం పథకాలను అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వన్నూర్ వలి, రాము యాదవ్,అంబన్న, హనుమప్ప, అంజి,తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్ ప్రయోజనాలపై అవగాహన



శక్తి యాప్‌పై అవగాహన కలిగిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ రాణెమ్మ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** మహిళలపై జరిగే నేరాలు, శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి నంద్యాల పట్టణంలోని గురురాజ బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ నందు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా ఆదేశాల మేరకు నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రాణెమ్మ ఆధ్వర్యంలో మంగళవారం గురురాజా బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ నందు మహిళలపై జరిగే నేరాలు, శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ క్రైం, 100, 112 టోల్ ఫ్రీ నంబర్ల గురించి, యూవ్‌టీజింగ్, తదితర వాటిని గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాల గురించి వివరించి ఏలా రక్షించుకోవాలో అనే అంశంపై విద్యార్థినీలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కొరకు తీసుకొని వచ్చిన శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలని అన్నారు. అలాగే సైబర్ క్రైం నేరాల భారీన పడకుండా స్వీయరక్షణ తీసుకోవాలని, వ్యక్తిగత సమాచారం పంచుకోరాదని, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన ఓటీపీలు ఎవరికీ సేర్ చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో తాలుకా పోలీస్ స్టేషన్ సిబ్బంది, బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వెల్లాల లలితమ్మ ఆధ్వర్యంలో కొత్త పెన్షన్ పంపిణీ



**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 35వ వార్డు అమరావతి నగర్ కాలనీలో నూతనంగా మంజూరైన పెన్షన్స్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లలితమ్మ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రకటించిన కొత్త పెన్షన్ మంజూరు విధానం వలన ఎవరికైనా దురదృష్టవశాత్తు భర్త చనిపోతే చనిపోయిన నెలలోపలనే భార్య పెన్షన్‌కు రావడం ఆ మహిళకు ఆర్థిక భరోసా కల్పించినట్లు ఆవుతుందన్నారు. ఆదోని డాక్టర్ ఎమ్మెల్యే బి. పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సౌత్ జోన్ అధ్యక్షులు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షురాలు నూర్జాహాన్, వీరన్న, సచివాలయం ఆడ్మిన్ నాగబాబు, సెక్రటరీలు లక్ష్మన్నచ, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రైతు సదస్సులు జయప్రదం చేయండి

**– రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఈనెల 4వతేదీన కర్నూలులో జరిగే జాతీయ రైతుల సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సాయిబాబానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాబు ధర కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్ట తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం, వస్త్రాలను అందించే రైతులను రక్షించాలంటే వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల పరిస్థితి బాగాలేదని, వ్యవసాయం గిట్టుబాటు కాక పట్టణ ప్రాంతాలకు వలసలు పోతున్నారని, వ్యవసాయపై చేసుకున్న అప్పులు భారమై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిమాండ్ల సాధన కోసం 60 సంవత్సరములు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.పదివేలు ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, కేరళ తరహాలో రైతులకు సబ్సిడీ రూపంలో వ్యవస3ఆయ పరికరాలను అందించాలని ఎప్రీల్ 4న జాతీయ రైతు సదస్సు కర్నూలులో నిర్వహించడం జరుగుతుందని, రైతులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, బాష, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

### రంజాన్ పర్యాటకులతో
# గాజులదిన్నె ప్రాజెక్టులో సందడి



గోనెగండ్ల, మేజర్ న్యూస్ : రంజాన్ పండగను పురస్కరించుకొని మంగళవారం ముస్లీం మహిళలు, పిల్లలు, యువకులు పెద్దఎత్తున గాజులదిన్నె ప్రాజెక్టుకు విచ్చేశారు. గతంలో పర్యాటక కేంద్రంగా ఉం డటంతో ఈ పండుగ సందర్భంగా ఎమ్మిగనూరు, కోడుమూరు, దేవనకొండ, గోనెగండ్ల తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యటనకు తమ స్వంతవాహనాల్లో తరలి వచ్చారు. పండుగ సందర్భంగా చేసి వంటకాలను తీసుకుచ్చి ప్రాజెక్టులో బంధువులు, స్నేహితులతో కలస చెట్ల కింద విడిది ఏర్పాటు చేసుకొని భోజనం చేసి ప్రాజెక్టు నీటిలో కొందసేపు జల క్రీడలాడారు. సాయంత్రం తమ స్వంత గ్రామాలకు బయలు దేరారు. దీంతో ఉదయం నుంచి ప్రాజెక్టు ప్రాంతం సందడిగా మారిపోయింది.

# యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడిగా అవినాష్ శెట్టి బాధ్యతలు

కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ : యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా ఎం అవినాష్ శెట్టి మంగళవారం యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడుగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి కర్నూలులోని తన కార్యాలయంలో అవినాష్ శెట్టిని ఘనంగా సత్కరించారు. లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర అభివృద్ధి కోసం అవినాష్ శెట్టి చేస్తున్న కృషి వెలకట్టలేనిదని అన్నారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడుగా దేశవ్యాప్తంగా యోగా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన కమిటీ ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిందన్నారు. 2029మార్చి వరకు కమిటీ కొనసాగుతుందన్నారు. అనంతరం అవినాష్ శెట్టి మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు భారతదేశ వ్యాప్తంగాయోగా క్రీడ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రతిభ గల యువ యోగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడు ముందుంటానని అన్నారు. తనను ప్రోత్సహించిన ఏషియన్ యోగా సంఘం అధ్యక్షుడు



అశోక్ కుమార్ అగర్వాల్, నూతన అధ్యక్షుడు అనిరుద్ గుప్తాతో పాటు ప్రధాన కార్యదర్శి అభినవ జోషి, ఉపాధ్యక్షులు మనోహర్ కుమార్, అధ్యక్షుడు సింహరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు వర్మలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అవినాష్ బాధ్యత స్వీకరణ పట్ల జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్ కుమార్,సభ్యులు డాక్టర్ రుద్రరెడ్డి, ఈశ్వర్ నాయుడు,జిల్లా యోగా సంఘం సభ్యులు సాగర్,సాయి కృష్ణ, ముంతాజ్ బేగం, నాగరాజులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా చేపట్టండి

## – సర్వేలను త్వరితగతిన పూర్తి చేయండి : కలెక్టర్

నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సచివాలయ సర్వీసులు , ఉపాధి హామీ, హౌసింగ్ అంశాలపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈకేవైసీకి సంబంధించి ఇంకా 2,68,182 పెండింగ్ ఉన్నాయని



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఎన్పీసీఐ, నాన్ రెసిడెన్సీ, పిల్లల విత్‌ఔట్ ఆధార్ తదితర సర్వేలను పూర్తి చేయించాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయడానికి గాను రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన లబ్ధిదారులకు తెలియజేసి గృహాలు నిర్మించుకొనేలా మోటివేట్ చేయాలన్నారు. ఆత్మకూరు, ఆళ్ళగడ్డ, పగిడ్యాల, ఆత్మకూరు అర్బన్, డోన్, జూపాడుబంగ్లాలోని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయం గురించి తెలియజేయాలన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా, మండలాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిళ్ళు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను ప్రతి 15రోజులకు ఒకసారి శుభ్రం చేస్తూ, ప్రతి రెండు రోజులకు ఒకసారి హెచ్2ఎస్ కిట్ల ద్వారా నీటి నమూనాలను సేకరించి వాటిని పరీక్ష చేస్తూ ఉండాలన్నారు. పి4 సర్వేకు సంబంధించి పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఉగాది రోజున ప్రారంభించడం జరిగిందన్నారు. వాట్సాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఇంటి వద్ద నుంచే ఫోన్ ద్వారా సర్వీసులు పొందే అవకాశం ఉంటుందన్నారు. అందులో విద్యుత్ బిల్లు విద్యార్థుల హాల్‌టికెట్స్, తదితర వాటిని తీసుకోవచ్చన్నారు.

## సీతారామచంద్రుల కళ్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు సీతారామచంద్రుల కళ్యాణ పత్రికను అందజేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ : జూపాడుబంగ్లా మండల పరిధిలోని పూడిచెర్ల గ్రామంలో ఏప్రిల్ 6వ తేదీన జరిగే శ్రీ సీతారామచంద్రుల కళ్యాణ మహోత్సవానికి నందికోట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యకు గ్రామ సర్పంచ్ బాల మద్దిలేటి, టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లబోతుల రాముడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేసి గ్రామంలో నిర్వహించే శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ మహోత్సవానికి మీరు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆయనను ప్రేమ పూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్ర, వీరభద్ర, లింగమయ్య దేవస్థానాల సన్నిధానంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం, అర్చన, పూజలు, అభిషేకముల మధ్య ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేను ముఖ్య అతిథిగా ఆహ్వానించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యం, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ఆటిజం

## పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డా. శ్వేతా రాంపల్లి

:- కిమ్స్ కడల్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డా. శ్వేతా రాంపల్లి



మాట్లాడుతున్న కిమ్స్ కడల్ కన్సల్టెంట్

కర్నూలు, మేజర్‌న్యూస్ : వయసుకు తగ్గట్లు పిల్లల్లో రావాల్సిన మానసిక పరమైన ఎదుగుదల రాకుండ ఉండే పరిస్థితినే ఆటిజం అంటారని కిమ్స్ కడల్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డా. శ్వేతా రాంపల్లి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆటిజం ప్రధానంగా పిల్లలపై ప్రభావం చూపుతుందన్నారు. ఇతరులతో పరస్పర సంబంధం మరియు కమ్యూనికేషన్‌లో తీవ్రమైన లోపం ఉండటం దీని ప్రధాన లక్షణమన్నారు. గత 15సం॥లలో ఆటిజం ప్రబల్యత పెరుగుతోందన్నారు. 15ఏళ్ల క్రితం ప్రతి 150మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం కనిపించేది ప్రస్తుతం 30మంది పిల్లల్లో ఒకరికి ఈ వ్యాధి ఉన్నట్లు గుర్తిస్తున్నారన్నారు.

**ఆటిజం లక్షణాలు ఏమిటి..? :-** మాట్లాడడంలో ఇబ్బంది, స్నేహితులను కలిగి ఉండలేకపోవడం, గుంపులో ఆటలలో పాల్గొనలేకపోవడం, బొమ్మలను పంచుకోవడంలో ఆసక్తి లేకపోవడం, కళ్లలోకి నేరుగా చూడలేకపోవడం, చేతి సంకేతాల ద్వారా కమ్యూనికేట్ చేయడంలో అంతరాయం, అదేపనిగా దూకడం, బొమ్మలను వరుసగా అమర్చడం, ఒకే పనిపై ఆసక్తి ఉండటం, ఆహారం లేదా ఆటలో మార్పు వస్తే అసహనం చెందడం, పదేపదే ఒకదానిని తాకడం లేదా వాసన చూడటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ప్రతి ఆటిజం పిల్లల్లో ఈ లక్షణాలన్నీ ఉండకపోవచ్చు అన్నారు. ఆటిజం ఎందుకు వస్తుందో ఇప్పటికీ స్పష్టమైన కారణం తెలియదన్నారు.

**భాషా అభివృద్ధిలో జాప్యం :** సామాజిక సంకేతాలను అర్థం చేసుకోవడంలో లోపం కారణంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు(ప్రమాదవశాత్తు గాయాలు, నీటిలో మునిగిపోవడం) పిల్లల్లో ఆటిజం అనుమానం వచ్చినప్పుడు అతన్ని సమగ్ర బాల వికాస కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు.

**ఆటిజానికి చికిత్స ఏమిటి :** ప్రాథమికంగా ప్రవర్తనా చికిత్స అనుసరించాలి, 50శాతం పిల్లలకు సంబంధిత ప్రవర్తన సమస్యల నియంత్రణ కోసం మందులు అవసరం అవుతాయన్నారు. తల్లిదండ్రుల శిక్షణ కార్యక్రమాలు ముఖ్యమైన భాగమని వారానికి 30-40గంటల తల్లిదండ్రుల సహాయం చికిత్సలో కీలకమన్నారు.

**ఆటిజం పూర్తిగా నయం అవుతుందా.. :-** తాజా అధ్యయనాల ప్రకారం 3సం॥ లోపు పిల్లలలో ఆటిజం గుర్తించి చికిత్స ప్రారంభిస్తే 10శాతం పైగా పిల్లలు పూర్తిగా కోలుకునే అవకాశం ఉందన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు ఎంఈఓ ఇందిరా

వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్: మార్చి 17వ తేదిన ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు మంగళవారం రోజు జరిగిన సోషల్ పరీక్షతో ప్రశాంతంగా ముగిసి నట్లు మండల విద్యాశాఖ అధికారిణి ఇందిరా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని బాలుర, బాలికల హైస్కూల్ కేంద్రాలు, డా.బీఆర్.అంబేద్కర్ ఎస్సి బాలికల గురుకులంలో రెండు కేంద్రాలు, మండల పరిధిలోని రామళ్ళకోట కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలను విద్యార్థినీ, విద్యార్థులు వ్రాశారు. ఈ పరీక్షలకు మం డలంలోని 11 జిల్లా పరిషత్ హైస్కూళ్ళు, ఎస్సి, బీసి గురుకులాలు, కేజీబీవి, రెండు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు హాజరైయ్యారు. దీంతో చివరి పరీక్షను 1008 మంది విద్యార్థులు వ్రాయాల్సి ఉండగా 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు. పరీక్షలను దృష్టిలో ఉంచు కొని ఆయా పరీక్ష కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఆయా అధికా రులు పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పోలీసుల బందోబ స్తు, ఆరోగ్యశాఖ సేవలు, విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలతో ప్రశాంతంగా ముగిశాయన్నారు.

## ఘనంగా శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె ,మేజర్ న్యూస్ : నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతున్నాయి.ఈ తరుణంలో సోమవారం రాత్రి గ్రామంలో శ్రీదేవి భూదేవి చెన్నకేశవ స్వామి సమేత కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర రెడ్డి అమ్మవారికి చీరే, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం కుంకుమార్చన నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ పండితులచే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పివి కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమ్మె బాటలో విద్యుత్ బిల్ రీడర్లు




**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలో విద్యుత్ బిల్ రీడర్లు మంగళవారం నుండి సమ్మెబాట పట్టారు. 10,15 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో బిల్లు లీడర్లుగా పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా కనీస వేతనం చెల్లించకుండా పనిచేయుచుకుంటున్నారని వారికి ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రధానమైన డిమాండ్లతో బిల్ రీడర్ల సమ్మెకు సిద్ధమయ్యారు.అందులో భాగంగా ఆళ్లగడ్డ పట్టణ కేంద్రంలో బిల్ రీడర్ల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా నాయకులు టి రామచంద్రుడు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి రమేష్‌లు మాట్లాడుతూ విద్యుత్తు శాఖలో బిల్లు రీడర్లుగా గత కొన్ని సంవత్సరాలుగా అతి తక్కువ వేతనంతో పీస్ రేట్ పద్ధతిన పనిచేస్తూ ఎటువంటి ఉద్యోగ భద్రత లేక కనీస వేతన నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వీరి సమస్యలను ప్రతి సంవత్సరం ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్న పీస్ రేటు విధానం రద్దు చేయాలని కనీస వేతనం నిర్ణయించాలని కోరినప్పటికీ ప్రభుత్వాలు ఉన్నతాధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తూ ఉన్నారు అనేక సందర్భాల్లో ఇచ్చినటువంటి వాగ్దానాల్ని అమలు చేయకపోగా ఈరోజు బిల్ రీడర్ల ఉద్యోగానికి ముప్పు వచ్చే పద్ధతుల్లో సంస్థలో విధానాలు తయారైందని వాపోయారు విద్యుత్తు సంస్కరణలు వేగవంతం అవుతున్నటువంటి తరుణంలో ఈరోజు రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఇంటింటికి బిగిస్తామని ప్రీపెయిడ్ ద్వారానే కరెంటు బిల్లులు చెల్లించాల్సి వస్తుందని చర్చ జరుగుతుంది ఇక నేరుగా ప్రీపెయిడ్ ద్వారానే కరెంటు బిల్లులు చెల్లించే పద్ధతి వస్తే మీటర్ రీడర్స్ ఇక అక్కరకు రారు అని చర్చ జరుగుతోంది కావున మీటర్ రీడర్స్ యొక్క ఉద్యోగ భద్రతను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నతాధికారులకు ఉందని అందుకోసం ఉద్యోగ భద్రత కనీస వేతనం ఇవ్వాలని కొత్త ప్రభుత్వానికి ఎస్పీడీసీఎల్ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ యధావిధిగా నిర్లక్ష్య ధోరణి కొనసాగిస్తున్న నేపథ్యంలోనే 21 రోజులు ముందు సమ్మె నోటీసు ఇచ్చి ఏప్రిల్ ఒకటో తేదీన ఏరోజైనా సమ్మె చేస్తామని చెప్పినా అధికారులు ఏమాత్రం స్పందన లేదని ఈ విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం కారణంగానే సమ్మె ప్రారంభించామని ఈ సమ్మెను రాతపూర్వకమైన హామీ వచ్చేదాకా కొనసాగిస్తామని అందుకు సమ్మెకు సిఐటియు సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు ఈ సందర్భంగా మీటర్ రీడర్స్ మాట్లాడుతూ కేవలం పీఎస్ రేటు పేరు మీద 9000 రూపాయలు మాత్రమే జీతం ఇస్తూ కుటుంబం పోషణ చేయాలంటే ఎలా సాధ్యమవుతుందని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ కనీస వేతనం చెల్లించే విషయంలో ఇప్పటికీ దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నటువంటి కారణంగానే ఈరోజు సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందని అన్నారు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కనీస వేతన విషయంలో రాతపూర్వకమైనటవంటి స్పష్టత ఇవ్వకపోతే నిరవధిక సమ్మెకు కూడా సిద్ధపడాల్సి వస్తాదని వారు హెచ్చరించారు. అనంతరం నాలుగు కూడలి రోడ్ల వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిల్లింగ్ రీడర్స్ రమణ, మస్తాన్, సురేష్, శివా, విష్ణు,తదితరులు పాల్గొనడం జరిగింది.

## మూడు మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలి - గడ్డం నారాయణరెడ్డి

**ఎమ్మిగనూరు మేజర్ న్యూస్ ప్రతినిధి :** రబీ సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు రూరల్,గోనెగండ్ల,నందవరం మండలాలను కూడా కరవు మండలాలుగా గుర్తించాలని వైయస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో మొత్తం 9 మండలాలను కరవు మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. అయితే, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం తీవ్ర అన్యాయమన్నారు కర్నూలు జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో కరవు ప్రభావిత మండలాల జాబితాలో ఆస్పరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి మండలాలు చేర్చబడ్డాయి. అయితే, ఎమ్మిగనూరు రూరల్, గోనెగండ్ల, నందవరం మండలాలుఈ జాబితాలో లేకపోవడం తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల అక్కడి రైతులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మూడు మండలాల్లో వరుసగా వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.తగిన వర్షపాతం లేకపోవడంతో రైతుల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, చిరుధాన్యాలు, వేరుశెనగ, మరియు ఇతర ప్రధాన పంటలు పూర్తిగా నష్టపోయాయి. సాగునీటి కొరత తీవ్రంగా ఉంది. పైగా, ఈ ప్రాంతాల్లో భూగర్భజలాలు కూడా క్షీణించడంతో తాగునీటి సమస్య మరింత తీవ్రమైంది. రైతులు భూమిని సాగు చేసుకునే పరిస్థితి లేక పంటలు వేసే ధైర్యం చేయలేకపోతున్నారు. సాగునీటి ఎద్దడితో వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. వలసలు పెరిగే పరిస్థితి ఏర్పడుతోంది.నష్టపోయినరైతులకు తక్షణ న్యాయం చేయాలి కరవు మండలాలుగా గుర్తింపు లభిస్తే, రైతులకు రుణ మాఫీ, ఉచిత విత్తనాలు, ఎరువులు, ఉపశమన చర్యలు లభించేందుకు అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఎమ్మిగనూరు రూరల్,గోనెగండ్ల, నందవరం మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కరవు మండలాలుగా గుర్తించేందుకు ప్రభుత్వ అధికారులు వెంటనే ఈ ప్రాంతాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించాలి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత కావాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ మూడు మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలి. నష్టపోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి.కరవు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక పథకాలు తీసుకురావాలి. అంతేగాక, ఈ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి గ్రామీణ కార్మికులకు ఉపాధిని కల్పించాలి. ప్రభుత్వం వెంటనే ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టకపోతే, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమని గడ్డం నారాయణరెడ్డి హెచ్చరించారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే, నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## మూగ జీవాల దాహార్తి తీర్చేందుకే నీటి తొట్ల నిర్మాణం.. గిత్త

**-: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిన వైసీపీ**
**-: ఉపాధి నిధులను దారిమళ్లించి దోచుకున్న వైసీపీ**
**-: భూమి పూజ చేసిన ఎమ్మెల్యే జయసూర్య.**

**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** మూగ జీవాల దాహార్తి తీర్చేందుకే కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాలలో నీటితొట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు.మంగళవారం మండలంలోని వడ్డెమాను గ్రామంలో నీటి తొట్టి నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో మూగ జీవాలకు తాగు నీటి సమస్యలు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామాలలో పశువుల నీటి తొట్లనిర్మాణం చేపట్టిందన్నారు.ఒక్కొక్క నీటితొట్లనిర్మాణం కోసం ప్రభుత్వం రూ.33వేలు కేటాయిందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు 45 నీటి కుంటలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఉపాధి నిధులను దారిమళ్లించి దోచుకున్న ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని అన్నారు . కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే గ్రామాలలో ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.



బోర్లు, బావులలో భూగర్భ జలాలు పెంపొందించడం కోసం భారీ స్థాయిలో రాష్ట్రములో ఫారం పాండ్స్ తవ్వకాలు చేపట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, సర్పంచ్ రామచంద్రుడు, మాజీ సర్పంచ్ లు కట్టా సత్యం రెడ్డి, కేశవరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు కట్టా రాఘవ రెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఉపాధి హామీ ఏపీడీ అన్వర్ బేగం, ఏపీఓ అలివేలమ్మ, ఈసి షబానా, టెక్నీకల్ అసిస్టెంట్ ఉమేష్ , ఫీల్డ్ అసిస్టెంట్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లులు సకాలంలో కట్టండి.. ఏడిఈ రవికాంత్


ఏడీఈ రవికాంత్ చౌదరి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** వినియోగదారులందరూ విద్యుత్ బిల్లులు సకాలంలో కట్టాలని ఆళ్లగడ్డ ఏడిఈ రవికాంత్ చౌదరి అన్నారు. మంగళవారం ఆయనతనకార్యాలయంలో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులందరూ కరెంటు బిల్లు వచ్చిన 14 రోజుల్లోగా బిల్లులు కట్టి విద్యుత్ సంస్థలకు తోడ్పడాలన్నారు. వినియోగదారులందరూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకంలో ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందని మీ ఇంటి పైనే సోలార్ టవర్ ను ఏర్పాటు చేసుకోవచ్చు అన్నారు. గాలికాలం కావున రైతులు పొలాల్లో మోటార్ల దగ్గరికి వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు విద్యుత్ ఫోల్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తడి చేతులతో స్టార్టర్లను తగల వద్దని సూచించారు. రైతులు తమ పొలంలో కరెంటు వైర్లు జాయింట్ లేకుండాచూసుకోవాలన్నారు. జాయింట్లు ఉన్నచోట విద్యుత్ షాకుకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన సూచించారు.

## నిరంతరంగా దుకాణ అనుభవ లక్ష్యాల సాధనకు కృషి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** తమ వ్యాపార విస్తరణ పెంపొందించుకునేందుకు నిరంతరదుకాణ అనుభవ లక్ష్యాల సాధనకు కృషి చేస్తున్నామని అమెజాన్ ఫ్రెష్ ఇండియా డైరెక్టర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టియర్ -2,3 పట్టణ, నగరాలు అంతకుమించి చేరుకునేందుకు విస్తరించేందుకు మరింత అనుభూతిని ఇచ్చిందన్నారు. పోటీతత్వ ధరలు, కస్టమర్లు ఉన్నతమైన నాణ్యత ప్రమాణాలు కలిగిన కిరాణా సరుకులు పొందేలా, వారి ఇంటి వద్దకు సౌకర్యవంతంగా అందించడానికి అవకాశం కల్పించడం జరిగిందని చెప్పారు. ఎన్నో పట్టణాలకు తమ విస్తరణ ద్వారా కొత్త కస్టమర్లు అమెజాన్ ఫ్రెష్ విక్రతలు, బ్యాంకు భాగస్వాముల నుండి గొప్ప ఆదాలు, ఉత్తేజ భరితమైన డీల్స్ ను అందిస్తూనే తమ వారపు, నెలవారి కిరాణా బాస్కెట్లను రూపొందించుకోవడం అని అర్థం. ఈ విస్తరణ అనేది దేశవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల కోసం ఆన్లైన్ కిరాణా షాపింగ్ అనుభవాన్ని పూర్తి మార్చడానికి తాము సిద్ధంగా ఉన్నామని శ్రీకాంత్ శ్రీరామ్ స్పష్టం చేశారు.

## శ్రీ సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



**కృష్ణగిరి,మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పోతుగల్లు మజారా గ్రామమైన గుండ్ల మల్లాపురంలో శ్రీ సుంకులమ్మ అమ్మవారి ని దర్శించుకొని ప్రత్యేక పూజలను పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీ దేవమ్మ నిర్వహించారు.గుండ్ల మల్లాపురం గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని మాజీ ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కృష్ణగిరి ఎంపిపి డాక్టర్ కంగాటి వెంకట రామిరెడ్డి,జడ్పిటీసీ సభ్యురాలు కె.యి సుభాషిణి,సర్పంచు వాణిశ్రీ ఇంకా పలువురు నాయకులు,కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ని నిర్మూలిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**బనగానపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** ప్లాస్టిక్ నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడాలని బనగానపల్లి సతీష్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈరోజు పట్టణము నందు బి.సతీష్ కుమార్ రెడ్డి మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది కొత్త కూరగాయల మార్కెట్‌లో మరియు మార్కెట్ కు పరిదిలో వున్న ఆకుల మునయ్య అంగడి, నారాయణ అంగడి, తిరుపాలు అంగళ్ళ దగ్గరికి వెళ్లి ప్లాస్టిక్ కవర్లు వాడవద్దు డీ గ్రేడ్ ప్లాస్టిక్ కవర్లు మాత్రమే వాడాలని తెలియజేయడం జరిగింది. ప్రజలకు ప్లాస్టిక్ కవర్లు ఇచ్చినచో జరిమాన విధించబడునని హెచ్చరించారు.

## రోజుకో యాప్‌ల పనిభారం తగ్గించండి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** రాష్ట్రంలోని అంగన్‌వాడివర్కర్లు పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని పనిభారం నుండి తప్పించి, వారిని అనారోగ్యాలకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడి వర్కర్లస్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజుకో యాప్‌ల ద్వారా అంగన్‌వాడివర్కర్లు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని, చిన్నారుల పోషణను, బాలింతలు, గర్భిణీల సంరక్షణకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, వారు చేయాల్సిన పనికంటే యాప్‌ల ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అంగన్‌వాడి కేంద్రానికి వచ్చిన నాటినుండి యాప్‌లలో పనిచేయాల్సి వస్తుందన్నారు. కావున ప్రభుత్వం అంగన్‌వాడివర్కర్లు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని,లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు.

## పశువుల నీటితొట్టి నిర్మాణానికి భూమిపూజ

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని పశువుల దాహం తీర్చడానికి వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీ యందు మంగళవారం భూమిపూజ చేసినట్లు పంచాయితీ సిబ్బంది పేర్కొన్నారు. భూమి పూజ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఏపిడి, సిడిసిఎల్ ఆర్‌సి, ఉపాధి హామి పథకం సిబ్బంది పాల్గొన్నారు.



## భవిష్యత్తు తరాలకు చెట్ల ప్రాముఖ్యత తెల్పండి



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలపునఃప్రారంభోత్సవాన్ని పురస్కరించుకునిమంగళవారం చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లే శ్వర్ రెడ్డి, అధ్యాపకులు చిన్న పీరయ్య, మురళీమోహన్‌రెడ్డి,రత్నాకర్, విజయ్ కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఓబులేసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ మల్లేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చెట్లు మన పర్యావరణానికి, మనిషి ఆరోగ్యానికి కీలకమైనవి అని ఇవి గాలికాలుష్యాన్ని తగ్గించి, ఆక్సిజన్‌ను విడుదలచేసి,భూమిని ఉష్ణోగ్రత పెరుగుదల నుంచి కాపాడతాయి. అలాగే వర్షపాతం పెరుగుదలకు సహాయపడుతూ, భూగర్భ జలాలను భద్రపరుస్తాయి. వన్యప్రాణులకు నివాసంగా మారి ప్రకృతి సమతుల్యతను కాపాడతాయి. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చెట్లు చాలా ఉపయోగపడతాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రకృతిపట్ల అవగాహనపెంచి, బాధ్యతా యుతమైన పౌరులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం జరిగిందన్నారు.

## మండలంలో జోరుగా పెన్షన్ పంపిణీ కార్యక్రమం



గ్రామ సర్పంచ్ పాండు రంగన్న తో కలసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తున్న అధికారులు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో జోరుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉదయం 7:00గం,, ప్రారంభమైన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మండల అధికారులు సైతం పాల్గొని వృద్ధాప్య, దివ్యాంగుల,వితంతులకు తమ ఇంటివద్దన్నే పెన్షన్ పంపిణి చేశారు. కొన్ని చోట్ల సర్వర్, థంబ్, ఐరిస్ మోరాయించి అంత రాయం ఏర్పాడిన్నప్పటికి అనంతరం యధావిధిగా కొనసాగించారు. సాయంత్రానికి మం డలవ్యాప్తంగా 91.96 శాతం పెన్షన్ పంపిణి చేసినట్టు అధికారులు తెలిపారు.

## పశువులకు నీటి వసతి కై కేంద్రాల ఏర్పాటుకు భూమిపూజా



**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఆలంకొండ ,కటారుకొండ గ్రామాలలో పశువులకు నీటి వసతి కల్పించడానికి కేంద్రాల ఏర్పాటుకు భూమి పూజను నూతనంగా నియమితులు కాబోతున్న మార్కెట్‌యార్డు చైర్మెన్ ఎస్.కె.నబీ సాహెబ్,టీడీపీ మండల కన్వీనర్ మద్రి శ్రీరాములు పాల్గొని భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ జి.మోహన్‌కుమార్, ఏపిఓ నాగసులోచన మాట్లాడుతూ మండలానికి పది నీటి వసతి కేంద్రాలు మంజూరు అయ్యాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూ.గురుస్వామి,రఫి ఇంకా ఆయా గ్రామాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెళ్ళికానుక పంపిణీ చేసిన బీసీ రాజారెడ్డి



పెళ్లి కానుక అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, మేజర్ న్యూస్ :** నియోజకవర్గం లోని పేదరికంలో ఇబ్బంది పడుతున్న వారు పెళ్లి చేసుకుంటే వారికి పెళ్లి కానుక కింద పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పెళ్లి కానుకను అందజేయడం జరుగు తుంది. ఈ మేరకు మంగళవారం నాడు బనగానపల్లె పట్టణంలోని కొండపేట కాలనీకి చెందిన మహబూబ్ హుస్సేన్ వారి కుటుంబ సభ్యులకు, మరియు నియోజకవర్గంలోని అవుకు మండలానికి సంబంధించిన మరొకరికి పెళ్ళికానుక కిట్లను బిసి రాజారెడ్డి చేతులమీదుగా అందజేశారు. గత కొన్ని సంవత్సరాల నుండి సొంత నిధుల తో బీసీ రాజారెడ్డి నూతన వధూవరులకు పెళ్లి కానుకను అందజేయడం ఆనావాయితీగా జరుగుతుంది.

## ఏప్రిల్ 3న రంగారావు గోష్టి ఆధ్వర్యంలో అన్నవితరణ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** రంగారావు గోష్టి ఆధ్వర్యంలో ఈనెల 3 గురువారంఅన్న వితరణ కార్యక్రమం ఉంటుందని రంగారావు గోష్టి నిర్వాహకులు ఏ డి ఈ రవి కాంత్ చౌదరి అన్నారు. ఆయన మంగళవారం మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ రంగారావు గోష్టి వ్యవస్థాపకులు స్వర్గీయ రంగారావు మూడో వర్ధంతిని పురస్కరించుకొని అహోబిలం పుణ్యక్షేత్రంతో పాటు ఆళ్లగడ్డ పట్టణంలోని అన్ని అనాధ శరణాలయాల్లో అన్న వితరణ కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు.

## క్రికెట్ బెట్టింగుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** క్రికెట్ బెట్టింగ్ ల పై యువత అప్రమత్తంగా ఉండాలని పెద్దకడుబూరు ఎస్ఐ.నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కంభళదిన్నె గ్రామంలో సైబర్‌నేరాల పై గ్రామంలోని విద్యార్థులు. యువత. ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన పలువురిని ఉద్దేశించి మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ వలన జరిగే నష్టాలు వలన అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడితుందని అంతేకాకుండా ఆర్థికంగా కూడా నష్ట పోతారని. అలాగే సైబర్ నేరాగాల్లు చేసే మోసాలు వల్ల అమాయక ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆయన ప్రజలకు తెలియజేశారు. అలాగే గ్రామంలో కొందరు యువకులు మద్యం సేవించి అమాయక ప్రజలపై దాడులకు దిగుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అంతే కాకుండా గ్రామంలోని అమాయక ప్రజలపై దౌర్జన్యం. బెదిరింపులకు పాల్పడుతున్నారని దీంతో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే పార్టీ వారైన సరే అటు వంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగునే గ్రామంలో ప్రతి ఒక్కరు కలసి మెలసి జీవించాలనిఆయన చెప్పారు. అలాగే గ్రామంలో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే అటువంటి వారిపై తమ పోలీసు సిబ్బంది బెల్టు తీయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## నీటి జగ్గుతో వ్యక్తి పై దాడి..ముగ్గురి పై కేసు నమోదు

**మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు కు తరలింపు**

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలో శేషం చిన్న రంగన్న పై ఆదే గ్రామానికి చెందిన ఆశోక్తో పాటు మరో ఇద్దరు నీటి జగ్గుతో దాడిచేసి తలకు తీవ్ర రక్తస్రావం అయ్యే విధంగా గాయ పరిచారని వారి పై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయబాస్కర్ తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు శేషం చిన్నరంగన్న పంచాయతీ అధికారులు అనుమతితో తన ఇంటి దగ్గర తాగునీటి కోళాయిని వేసుకోవాలనుకున్నాడు. అందులో బాగంగా మంగళవారం చిన్న రంగన్న పైప్ లైన్ కోసం గంతను తవ్వుతుండగా ఆశోక్, మరో ఇద్దరు వ్యక్తులు మా ఇంటి ముందు గుంతను తవ్వకూడదని అడ్డుకున్నారు. అయితే గ్రామ పంచాయతీ అధికారులు గుంత తవ్వుకోమని అనుమతిని ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి లోనైన ఆశోక్, మరో ఇద్దరు శేషం చిన్నరంగన్నతో ఘర్షనకు దిగారు. దీంతో ఆగ్రహానికి లోనైన అశోక్, మరో ఇద్దరు పక్కనే ఉన్న నీటి జగ్గుతో శేషం చిన్న రంగన్న తలపై బాదారు. దీంతో రంగన్న తలకు తీవ్రగాయామైంది. రక్తస్రావం జరిగింది. హుటాహుటిన చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవలకోసంకర్నూలు ఆసుపత్రికి రంగన్నను తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నాట్లు పోలీసులు తెలిపారు.

## నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి- ఫ్యాప్టో




సమావేశంలో మాట్లాడుతున్న మాధవ స్వామి

**బనగానపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థికపరమైన డిమాండ్ల సాధనకై తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు ఎం మధుసూదన్ రావు, బి మాధవ స్వామి, కే సత్య ప్రకాష్, శ్రీనివాస రెడ్డి లు కోరారు. బనగానపల్లిడివిజన్లోని ఏపీటీఎఫ్‌కార్యాలయంలోని సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు ఏప్రిల్ రెండవ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయము నందు క్రింది సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. కావున నంద్యాల జిల్లాలోని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల బాధ్యులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాము. సిపిఎస్, జిపిఎస్ లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి, ప్రభుత్వము బకాయిపడ్డ మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలి, ప్రభుత్వము వెంటనే స్పందించి పిఆర్సీ కమిషన్ నియమించాలని పిఆర్సీ కమిషన్ నియమిచ్చుట ఆలస్యమైనట్లయితే వెంటనే 30% మధ్యంతర భృతిని ప్రకటించాలి, 2004వ సంవత్సరం కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్రం అమలుపరిచిన జీవో నెంబర్ 57 ను అమలు చేసి వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి,5. ఇంగ్లీష్ మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు మరియు ఉర్దూ మాధ్యమాలను కొనసాగించాలి అని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వెంకట కృష్ణుడు, ప్రతాప్,పోలియ నాయక్ ,మల్లికార్జున ,శేఖర్, రామస్వామి. రామకృష్ణ, గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కరువు మండలంగా ప్రకటించాలి

**ః- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్**



మాట్లాడుతున్న జిల్లా నాగేష్ యాదవ్

**తుగ్గలి, మేజర్‌న్యూస్ ః** జిల్లాలో అత్యంత వెనుకబడిన తుగ్గలి మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించకపోవడం చాలా బాధాకరమని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది తుగ్గలి, రాతన, ఉప్పర్లపల్లి గ్రామాలలో నల్లరేగడి పొలాల్లో రబీ కింద సాగు చేసిన పప్పుశనగ, పత్తి, జొన్న తదితర పంటలు పూర్తిగా దిగుబడి రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని అన్నారు. కనీసం ఈ ప్రాంతానికి ఎలాంటి సాగు నీరు లేదని, మొత్తం వర్షాధారం పైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. అయితే ప్రభుత్వం తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి కరువు మండలం ప్రకటించే దాక రైతులతో కలిసి వైసిపి పార్టీ ఆందోళనలు చేపడుతుందన్నారు. తమనేత మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ, మండల వైసిపి నాయకులతో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామన్నారు.

### ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో

## మజ్జిగ పంపిణీ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు .పదవ తరగతి పరీక్షలు వ్రా సి వస్తున్న పిల్లలకు, ఉపాధ్యాయులకు ,తల్లిదండ్రులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఇన్నర్ వీల్ అధ్యక్షులు ఉషారాణి సభ్యులు గాయత్రీ దేవి, కృష్ణ కుమారి, శ్రీదేవి ,సుజాత ,రాధ ,ఉమా, విజయ, పద్మ ,కవిత తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పది పరీక్షలు

**కల్లూరు, మేజర్‌న్యూస్ ః**

కల్లూరు మండలంలో గత నెల 17వ తేదీన ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ-2 వనజ తెలిపారు. చివరిరోజు మంగళవారం విద్యార్థులు సోషల్ పరీక్షను రాసి సంతోషంగా పరీక్ష కేం ద్రాల నుండి బయటకు వచ్చారు. మండలంలో మొత్తం18సెంటర్లలో3798మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3774మంది పరీక్షలు రాయగా 24మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 వనజ తెలిపారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండ ప్రశాంతంగా పరీక్షలు జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పబ్లిక్ పరీక్షల నుండి విద్యార్థులకు ఉపశమనం కలగడంతో విద్యార్థులు రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు కొడుతూ పరీక్ష హాల్ నుండి బయటకు వచ్చారు. హాస్టల్ విద్యార్థులు ఇంటి బాట పట్టారు.

సూర్య

బుధవారం | 02 ఏప్రిల్ 2025

# బైలుప్పల ఉగాది ఉత్సవాలలో ఎమ్మెల్యే బీవీ పూజలు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** బైలుప్పలలో ఉగా ది ఉత్సవాలలో బాగంగా చెన్నకేశవస్వామి జాతర నిర్వహించారు. ఈ జాతరను ఐదు రోజులపాటు ఘనంగా గ్రామ ప్రజలు జరు పుకుంటారు. ఈసందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చెన్నకేశ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే ప్రభకు కూడా ఎమ్మె ల్యే బీవీ ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం అంగరంగవైభవంగా ప్రభోత్సవంను గ్రామ ప్రజలు జరుపుకున్నారు. 100 అడుగుల ప్రభను ప్రత్యేకంగా రంగులు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ఆంజినేయ స్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు ప్రబోత్సవం చేపట్టారు. వంద అడుగుల ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది. గ్రామ ప్రజలు. భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రభోత్సం నిర్వహించడంతో ప్రభోత్సవం ను తిలకించేందుకు చుట్ట పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మండల టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం

**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** వేసవి సమీపించడంతో ప్రజల దాహార్తి తీర్చేందు కు జనసేన ఆధ్వర్యంలో చలివేం ద్రం ఏర్పాటు చేసినట్లు నందికొట్కూరు జనసేన సీనియర్ నాయకుడు మండ్లెం రామిరెడ్డి అన్నారు. మంగ ళవారం నియో జకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యం లో చలి వేంద్రం ఏర్పాటు చేశారు.జనసేన చలి వేంద్రం ఏర్పాటుకు ముఖ్య అతిథులుగా కర్నూల్ ఇంచార్జ్ షేక్ అర్షద్, జనసేన నాయకులు, మారుతీ ఫొటో స్టూడియో బాలరాజు,ఎస్. ఆర్‌ఫొటో స్టూడి యో సతీష్ ఆధ్వర్యంలో చదివేంద్ర ప్రారం భించారు. ఈ సందర్భంగా కర్నూలు జనసే న ఇన్చార్జి అర్షద్ మాట్లాడుతూ ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ విలువలతో




కూడిన సేవా రాజకీయాలను స్ఫూర్తిగా తీసుకొని జనసేవలో జనసేనాని బాటలో సమాజాని కి తమ వంతు బాధ్యతగా సేవ చేయాలని ఏప్రిల్, మే నెలలో ఎండలు తీవ్రంగా ఉం డడం వలన ప్రజలు బయటికి రావడానికి భయపడుతున్నారని వృత్తిరీత్యా, రోజువారి పనుల దృష్ట్యా బయటకు వచ్చిన ప్రజలకు ఎండ తీవ్రతను తట్టుకునే విధంగా చలివేం ద్రం ఏర్పాటు చేసి చల్లని మంచినీటి త్రాగు నీరును పంపిణీ చేయడం ద్వారా జనసేన నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జనసైనికు డు జనసేన రాము, జనసేన మధు,పుష్ప రాజ్ నాగరాజు, రహమాన్, రమణ,క్రాంతి, నాయుడు, కీర్తి రమణ, రమణ,మాస్టర్ శ్రీను, ఫ్రెండ్స్ బాబు, వడ్డెపేట రమణ, మహబూబ్ బాషా, వెన్నెల కిషోర్, మల్లి, వినోద్, ఖాజా, సలాం, రియాజ్, రాజు, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే

**-:ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ పంపిణీ -:వడ్డెమాను పింఛన్ పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే**



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** గత ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ హయ ంలో అభివృద్ధి కుంటుపడిందని కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఒకపక్క అభివృ ద్ధికి మరియు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని నందికొ ట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. మంగళవారం మం డల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో ఎన్టీ ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు.లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పింఛన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఎన్ని కష్టాలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి, మాజీ సర్పంచులు కట్ట సత్యంరెడ్డి, కేశవరెడ్డి నాగేశ్వరరెడ్డి సర్పంచ్ రామచంద్రుడు, నాగేశ్వరావు రెడ్డి, రాఘవరెడ్డి, విజేయుడు, వెంకట రాముడు, సున్నంపల్లి శ్రీనివాసులు, ప్రదీప్ కుమార్, సురేంద్ర, జయపాల్, నాగేశ్వర్ రెడ్డి, అధికారులు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 90.21శాతం పూర్తయిన పింఛన్ల పంపిణీ


పించన్లు పంపిణీ చేస్తున్న ఎంపిడిఓ

**కల్లూరు, మేజర్ న్యూస్ :** కల్లూరు మండలంలో 90.21 శాతం ఎన్‌టిఆర్ భరో సా పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపి డిఓ జివిఎస్ రెడ్డి తెలిపారు. మంగళవా రం మండల పరిధి లోని మార్కాపురం, పెద్దకొట్టాల గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరు గుతూ అర్హులైన ప్రతిఒక్కరికి పించన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ తెలిపారు. ఇంకా ఎవరైనా దివ్యాంగులు అర్హులై ఉండి పించన్లు అం దకుండ ఉంటే ఈ నెల 4వ తేదీన సదరం క్యాంపుకు వెళ్లి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీకి రూ.3లక్షలకు పైగా ఆదాయం

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** 2025-2026 సంవత్సరానికి గాను నిర్వహించిన వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీ వేళాలు ముగిశాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ దాదాపు పదిరోజులలో రెండు పర్యాయాలు వాయిదా పడి, ఒక్కొక్క వేలం నిర్వహిస్తూ, చివరకు వేలాలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. ఈఓఆర్‌డి రవికిషోర్ పర్యవేక్షణలో సర్పంచ్ ముత్యాల శైలజ, ఈఓ లక్ష్మినాథ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన బస్టాండ్ పార్కింగ్, రైల్వేస్టేషన్ రోడ్డులో గల గదులు, జంతువధ శాల, మాంసపు దుకాణాలు, దినసరి వారపు సంత మార్కెట్, సంత మార్కెట్ గదుల వేలాలు నిర్వహించారు. ఈ ఏడాది వేలాలు రూ.41,56,850లు పంచాయితీకి ఆదాయం లభించగా, గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.3,55,700లు ఆదనంగా వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేత పాల్గొన్నారు.

# మద్యం మత్తులో భార్యపై గొడ్డలితో దాడి..

**తీవ్ర గాయాలైన కవితను ఆసుపత్రికి తరలింపు...**



**ఆలూరు,మేజర్ న్యూస్ :** ఆలూరు మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన వీరేష్ మద్యం మత్తులో భార్య కవిత పై విచక్షణ రహితంగా దాడి చేసి వీపుపై,ముఖంపై గొడ్డలితో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డ కవిత ను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హొత్తి బెలగల్ పంచాయతీ మజారా గ్రామమైన కె. అగ్రహారం లో నివాసం ఉంటున్న కవిత వీరేష్ దంపతుల మధ్య చాలా కాలంగా గొడవలు జరుగుతుండేవని వీరిద్దరు ప్రేమ వివాహం చేసుకు న్నారని అయినా కవిత భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ గొడవ పడేదని మంగళవారం వీరేష్ మ ద్యం మత్తులో ఇంటికి రాగా భర్త తో భార్య కవిత గొడవ పడడంతో తాగిన మత్తులో భార్యపై ఇంట్లో ఉన్న గొడ్డలితో దాడి చేయడంతో భార్య వీపుపై,ముఖం పై దాడి చేయగా తీవ్ర గాయాల య్యాయి. ఆమెను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆసుపత్రికి తరలిం చారు.ఆలూరు ఎస్సై షేక్ మహబూబ్ భాష కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తామన్నారు.వీరేష్ ,కవిత దంపతులు కు ఒక కుమారుడు,కూతురు సంతానం ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

# మహానందీశ్వరుడి ఉగాది ఆదాయం రూ.47.31లక్షలు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రానికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వేలాదిగా తరలి వచ్చిన కన్నడింగుల నుంచి ఉగాది ఆదాయంగా రూ.47,31,792 ఆదాయం లభించినట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు గత ఏడాది కంటే ఈ ఏడాది అధిక ఆదాయం లభించిందని అన్నారు. 2024 ఉగాదికి రూ.42,24818 రాగా 2025 ఉగాదికి రూ.47,31,792 ఆదాయం లభించిందని, గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.5,06,974 అధనపు ఆదాయం లభించిందని ఈవో పేర్కొన్నారు.

# అర్హులందరికీ పింఛన్లు

## - మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి


పించన్లు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడం జరుగుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల మండలంలోని అమడాల గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంత్రి చేపట్టారు. తమ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి వారికి గత ప్రభుత్వం కంటే రూ.వెయ్యి అధనంగా పెంచి వృద్దులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.4 వేల పింఛన్ ఇవ్వడం జరుగుతుందని, వికలాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.10 వేల పింఛన్ అందించడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి పింఛన్లు అందించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రతి నెల 1వ తారీకున ఇంటి వద్దకే వెళ్లి పించన్లు పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అనంతరం గ్రామస్థులతో పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్య సమస్య ఎక్కువగా ఉందని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని ఈవోపీఆర్‌డీ ప్రకాష్ నాయుడుకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఎంపీడీవో వరప్రసాదరావు, ఇన్‌చార్జీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ ప్రకాష్ నాయుడు, మండల ఇంజనీర్ చెంచయ్య, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోట్ల


వికలాంగుడికి పించన్ అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల, సర్పంచ్, గ్రామ టిడిపి నాయకులు

**డోన్, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామంలో బుధవారం డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా ఎన్‌టిఆర్ భరోసా పించన్లను గ్రామానికి చెందిన లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ భరోసా పథకం వల్ల వృద్దులు, వికలాంగులు, నిరుపేదలు ఆర్థికంగా కొంత ఊరట పొందుతున్నారని తెలిపారు. ప్రతి పించన్ మీ భరోసా, ప్రతి రూపాయి మీకు అండ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజల సమస్యలు తీర్చడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు. గ్రామ సర్పంచ్ ఉప్పరి రాధమ్మ, కూటమి నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ఉప్పరి రామాంజినేయులు, నాగభూషణంగౌడ్, గిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.